క్లుప్తంగా

నాటుసారా అడ్డుకట్టకు చర్యలు



ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ రూరల్: నాటు సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయన ఎక్సైజ్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం నవోదయం 2.0 పోస్టర్లను విడుదల చేశారు. తహసీల్దార్ శ్రీధర్, ఎక్సైజ్ సీఐలు సృజన్‌బాబు, ప్రసాద్‌రావు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో విమర్శించారు. వెంటనే చంద్రబాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ వారికి పనులు చేయకూడదని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అనడం చాలా సిగ్గుచేటన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనులు చేయకూడదని చెప్పడం క్షమించరాని విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు, అభిమానులు ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదా? అని ప్రశ్నించారు. వెంటనే ప్రజాస్వామ్యవాదులందరూ ఏకమై చంద్రబాబు వ్యాఖ్యలను తప్పు పట్టాలని కోరారు.

నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ

సోమందేపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లేకపోతే జరిమానాలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని జాతీయ రహదారిపై వాహనదారులకు నూతన మోటర్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, నిబంధనలు పాటించక పోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

బడ్జెట్‌లో రజకులకు తీవ్ర అన్యాయం

చిలమత్తూరు: రాష్ట్ర బడ్జెట్‌లో రజకులకు తీవ్ర అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 24 ద్వారా లాండ్రీలకిచ్చే 150 యూనిట్లు, జీఓ 75 ద్వారా దోబీ ఘాట్లకు ఇచ్చే ఉచిత విద్యుత్ అవసరాలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. సీఎం చంద్రబాబు రజకులపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. 2018, 19లలో సీఎంగా ఉన్న చంద్రబాబే ఆ జీఓలను తెచ్చారని, ఇప్పుడు ఆయనే వాటిని కాలరాస్తున్నారని విమర్శించారు. రజకులపై వివక్ష చూపితే తగిన సమయంలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి స్పందన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ పాఠశాల వద్ద సోమవారం అల్డా విజన్ ఐ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 252 మందికి పరీక్షలు నిర్వహించి 47 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం వారికి మందులు అందజేసి అందులో 18 మందిని శస్త్ర చికిత్స కోసం రెఫర్ చేశారు.

పాఠశాల స్థలం సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భూమిని అధికారుల ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. బాలాజీ లక్ష్మణదాస్ తన పేరిట ఉన్న 9.5 ఎకరాల భూమిని పాఠశాల నిర్మాణానికి దానంగా ఇచ్చారు. అయితే ఈ స్థలం అన్యక్రాంతం కావడంతో ఆయన వారసుదారులు రవికుమార్ తన తాత ఇచ్చిన ఆస్తిని పాఠశాలకు వాడుకోవాలని, అక్రమార్కులు ఆక్రమణ చేస్తున్నారని వెంటనే భూమిని కొలత వేసి హద్దులు గుర్తించాలని తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించారు. స్పందించిన అధికారులు సోమవారం సర్వే చేపట్టారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం !

విశాలమైన ప్రాంగణం... రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన భవనాలు.. అందుబాటులో సిబ్బంది... ఇలా 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది పెనుకొండ మార్కెట్‌యార్డు పరిస్థితి. మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన యార్డు... పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.



మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న షెడ్లు



పెనుకొండ మార్కెట్‌యార్డ్ కార్యాలయం



అధ్వానంగా ఉన్న మార్కెట్‌యార్డ్ ఆవరణ

- అధ్వాన స్థితిలో పెనుకొండ మార్కెట్‌యార్డు
- దశాబ్దాలుగా లక్ష్యం చేరుకోని వైనం
- నామమాత్రంగా మారుతున్న కమిటీలు

పెనుకొండ: పట్టణంలో ఉన్న మార్కెట్‌యార్డ్ అధ్వాన్నస్థితికి చేరుకుంది. దశాబ్దాలు గడచినా దుస్థితి మాత్రం మారడం లేదు. మార్కెట్‌యార్డ్ లక్ష్యంపై పాలకులతో పాటు అధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. నిర్లక్ష్యం నీడలో రోజురోజుకు ఆర్థికంగా చితికిపోతోంది. పట్టణ పరిధిలో ఏర్పాటైన మార్కెట్‌యార్డులో కోట్ల రూపాయల విలువైన గిడ్డంగులు, విశాల స్థలం ఉన్నాయి. పరిసరాల్లో పరిశుభ్రత కరువై విషసర్పాలకు నిలయంగా మారిపోయింది.

రైతులకు ప్రయోజనం సున్నా

ఏ మార్కెట్‌యార్డ్ చూసినా పశువుల సంత, గొర్రెలు, మేకలు, కోళ్ల సంత నిర్వహించడం, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకుకు పన్ను కట్టించుకోవడం వంటి కార్యకలాపాలు జోరుగా సాగుతుంటాయి. అయితే దీనికి పూర్తి విరుద్ధంగా మారింది పెనుకొండ మార్కెట్‌యార్డ్. అసలు అలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్న ఆలోచన అధికారులు, ఏర్పడిన కమిటీలు, పాలకుల్లో నేటికీ రావడం లేదు. మార్కెట్‌యార్డ్ కమిటీలు ఏర్పాటు జరుగుతున్నాయే తప్ప వాటి వల్ల ప్రయోజనం లేకపోతోంది. మార్కెట్ యార్డును కేవలం ఓ ప్రభుత్వ కార్యాలయంగా చూస్తున్నారే తప్ప మార్కెట్‌యార్డ్ లక్ష్యం ఏమిటన్న దిశగా దశాబ్దాలు గడచినా గుర్తించడం లేదు. దీంతో రైతులతో పాటు ప్రజలను అసంతృప్తికి గురిచేస్తోంది. పెనుకొండ పరిసరాల్లో ఉన్న కొత్తచెరువు, పావగడ, హిందూపురం, గోరంట్ల మార్కెట్‌యార్డులు ఎంతో సమర్థవంతంగా లాభాల బాటలో ముందుకు వెళుతుంటే పెనుకొండ మార్కెట్‌యార్డ్ మాత్రం తిరోగమిస్తోంది. రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేకపోగా ఇతర శాఖలకు విలువైన స్థలం కేటాయిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

తగ్గిన మార్కెట్‌యార్డు పరిధి

గతంలో పెనుకొండ మార్కెట్‌యార్డ్ కిందకు పెనుకొండతో పాటు కొత్తచెరువు, గోరంట్ల, రొద్దం, సోమందేపల్లి, పరిగి మండలాలు ఉండేవి. అయితే కొత్తచెరువు... పుట్టపర్తిలో కలిసిపోగా, అంతకు ముందే గోరంట్ల మార్కెట్‌యార్డ్ సంబంధం లేకుండా పోయింది. దీంతో ఆర్థికంగా పెద్ద దెబ్బతగిలింది. ప్రస్తుతం పెనుకొండ, రొద్దం, పరిగి మండలాలు మాత్రమే యార్డు పరిధిలో ఉన్నాయి. పెనుకొండ, రొద్దం మండలాల నుంచి మార్కెట్ యార్డ్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం లేకపోగా పరిగి మండలం సేవా మందిరం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుతో కర్ణాటక రాష్ట్రానికి తరలివెళ్లే లారీల నుంచి పన్ను వసూలు చేస్తూ మార్కెట్‌యార్డ్ సిబ్బంది కాలం గడుపుతున్నారు.

మంత్రి సవిత సహకారం కోసం ఎదురుచూపు

మార్కెట్‌యార్డ్ అభివృద్ధి కోసం రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళీశాఖామంత్రి సవిత సహకారం కోసం రైతులు, అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల అధికారులు, రైతులు, పలువురు నాయకులు మంత్రిని కలసి మార్కెట్‌యార్డ్ పరిస్థితిని వివరించారు. యార్డు అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి కొంత వరకు నిధులు మంజూరు చేయిస్తే ప్రధాన రోడ్డుకు ఎదురుగా కాంప్లెక్స్ భవనాలు ఏర్పాటు చేయించడంతో పాటు రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయించి పశువుల సంత నిర్వహణకు అనుకూలంగా మారుతుంది. ప్రతి వారం ఇక్కడ సంత నిర్వహిస్తే మార్కెట్‌యార్డ్ తలరాత మారడమే కాకుండా వ్యాపార కేంద్రంగా మారి ఎంతో మందికి జీవన భృతికి అండగా నిలిచే అవకాశం ఉంది. ఈ మేరకు మంత్రి జిల్లా స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యాపార కేంద్రంగా మారుతుంది



పెనుకొండ మార్కెట్‌యార్డ్‌లో ప్రతి వారం పశువుల సంత నిర్వహిస్తే వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. ఎంతో విలువైన మార్కెట్‌యార్డ్ నిరుపయోగంగా మారడం బాధాకరం. ఇక్కడి మార్కెట్‌యార్డ్‌కు రవాణా సౌకర్యంతో పాటు ప్రయాణ సౌకర్యం ఎంతో అనుకూలంగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని మార్కెట్‌యార్డ్‌కు జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వెంకటేష్‌నాయక్, పెనుకొండ

ఆదాయం తగ్గిపోయింది



పెనుకొండ మార్కెయార్డ్ నుంచి కొత్తచెరువు మార్కెట్‌యార్డ్ పుట్టపర్తిలో విలీనం కావడంతో ఆదాయం తగ్గిపోయింది. రైతుల నుంచి వచ్చే ప్రయోజనాలు సైతం ఏమీ లేవు. కేవలం పరిగి మండలం సేవా మందిరం వద్ద ఉన్న చెక్‌పోస్టు నుంచి కొంత వరకు ఆదాయం వస్తోంది. అలాగే హౌసింగ్‌కు గిడ్డంగులు బాడుగకు ఇవ్వడం ద్వారా కొంత బాడుగ వస్తోంది. ఇటీవల మంత్రి సవితను కలసి సమస్యను వివరించగా అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు.

– వెంకటేసులు, మార్కెట్‌యార్డ్ సెక్రటరీ, పెనుకొండ

వీరభద్రుడి సేవలో ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు



నాగేంద్రుడి విగ్రహం వద్ద నాయకులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ సోమవారం ఉదయం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. అలాగే ఆలయ విశిష్టతను అర్చకులతో అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు రాజశేఖర్, ప్రహ్లాదరెడ్డి, రమేష్‌బాబు ఆయన వెంట ఉన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చిలమత్తూరు: మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం చిలమత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జ్ తహసీల్దార్లను నియమిస్తున్నారని , దీని వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇన్‌చార్జ్‌లు ఉండటం వలన భూముల వ్యవహారంలో అవకతవకలు జరిగే అవకాశం ఉందని, వెంటనే రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని కోరారు. చుట్టపు చూపుగా వచ్చే తహసీల్దార్లు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, రామచంద్ర, నరసింహులు, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊటుకూరులో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: మండలంలోని ఊటుకూరులో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రతి గడపకూ వెళ్లి బాగున్నారా? సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఉషశ్రీచరణ్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటికీ ఒక్క నయా పైసా తమ ఖాతాల్లో పడలేదని ప్రజలు వాపోయారు. వైఎస్ జగనన్న చేసిన మేలు ఎన్నటికీ మరవలేమని ఊటుకూరు గ్రామ మహిళలు, విద్యార్థులు, రైతులు ఉషశ్రీచరణ్‌కు తెలిపారు. కోవిడ్ వంటి కష్ట సమయంలో తమను కాపాడిన మహా మనిషి వైఎస్ జగనన్నేనన్నారు.

జగనన్న ఇచ్చిన మాట తప్పలేదు

నమ్మించి మోసం చేయడం, ఇచ్చిన మాట తప్పడం ఏనాడూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయలేదని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న పాలనపై అప్పుడే ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని, మళ్లీ ఓట్లతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలకు మాత్రమే మేలు చేస్తానని చెప్పడం ఆయన రాజకీయ దురుద్దేశానికి అద్దం పట్టిందన్నారు. మంచి రోజులు వస్తాయని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చరణ్‌రెడ్డి, మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ దిలీప్‌కుమార్ యాదవ్, ఎంపీటీసీ అమరావతి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైతుల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు సోమవారం నిరసనకు దిగారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేసి అన్ని చెరువులకు సాగునీరు అందించాలన్నారు .రైతుల నుంచి సేకరించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతు కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, లేకపోతే భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలన్నారు. పట్టు రైతులకు ప్రోత్సాహకాన్ని మంజూరు చేయాలని, జింకల సమస్యను పరిష్కరించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. అంతకు ముందు సీ కొడిగేపల్లికి చెందిన రైతులు తహసీల్దార్ ఎదుట బైఠాయించి తమకు సాగు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లో సాగు పట్టాలు అందించడానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ కరుణాకర్ హామీ ఇచ్చారు. అలాగే రైతు సంఘం నాయకులు కూడా రైతు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, మడకశిర రైతు సంఘం అధ్యక్షుడు సోమ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్, రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వేమారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, సీఆర్ రెడ్డి, హనుమంతరాయప్ప, వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం నాయకులు సోమవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు, వలసలు నివారించే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలన్నారు, సబ్సిడీతో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరి, లక్ష్మీనరసప్ప, నగేష్, బాబావలి, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు రైతు సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అదే విధంగా బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటర్ పరీక్షకు 26 మంది విద్యార్థుల గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా 7 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మడకశిరలో 4, అగళి, గుడిబండ, అమరాపురంలో ఒక్కో కేంద్రంలో పరీక్షలను నిర్వహించారు. మొత్తం 7 కేంద్రాల్లో 1,673 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. అయితే 1,647 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. అన్ని కేంద్రాల్లో కలిసి 26 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

విద్యుత్‌శాఖ ఏఈగా విశ్వనాథ్

గుడిబండ: మండల కేంద్రంలోని విద్యుత్‌కార్యాలయంలో ఏఈగా విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గాండ్లపెంట మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. దీంతో పలువురు సిబ్బంది విశ్వనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఏఈ మాట్లాడుతూ రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమంలో రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమాధిపతి స్వామి జపానంద మాట్లాడుతూ భగవంతుడిని తెలుసుకోవడం సాధ్యమని, అయితే బోధనల నుంచి కాకుండా సాధనల నుంచి తెలుసుకోవాలని రామకృష్ణ పరమహంస హితవు పలికారన్నారు. అంతకు ముందు ఆశ్రమంలో రామకృష్ణ పరమహంస చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సుప్రభాతం, వేద ఘోష, రామకృష్ణ సంకీర్తనలు, విష్ణు సహస్రనామ పఠనం, బెంగాలి పాటలను స్వామిజీ ఆలపించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రొళ్ల: అంగనవాడీ కేంద్రాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యూట్రీషియన్ గార్డెన్‌లో పండిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని లక్కప్పనహళ్లి వడ్రహట్టి అంగనవాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన న్యూట్రీషియన్ గార్డెన్‌లో పండిన ఆకు కూరలు, కూరగాయలను గర్భిణులు, బాలింతలకు అందజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



గుడిబండ: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

పరిగి/అగళి/గుడిబండ/రొళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. పరిగి, అగళి, గుడిబండ, రొళ్ల మండల కేంద్రాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి మహిళల భద్రత, చట్టాలు, ఆరోగ్యం, విద్య, వైద్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రొళ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం 9వ తరగతి చదువుతున్న బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు జమేదార్ రామలింగయ్య తెలిపారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం



ఈఓ, చైర్మన్‌లను సత్కరిస్తున్న అధికారులు

లేపాక్షి: 'అందరి సహకారంతోనే లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు చొరవ చూపి సహాయ సహకారాలు అందించారు' అని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. సోమవారం లేపాక్షి దేవాలయంలో ప్రభుత్వ అధికారులకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ముందుగా అధికారులతో వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మహేష్‌ను చైర్మన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, సీఐలు ఆంజనేయులు, జనార్దన్, కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్‌అహమ్మద్, ఎంఈఓ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామి రెడ్డి, వ్యవసాయాధికారి శ్రీలత, ఏఈ వెంకటేశులు, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీ టూరిజం మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అంచెలంచెలుగా అభివృద్ధి పనులు



బీ ఖాతా పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు తాలూకా వ్యాప్తంగా అభివృద్ధి పనులు అంచెలంచెలుగా చేస్తున్నామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. తాలూకాలోని లింగదహళ్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే బస్ షెల్టర్, శౌచాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాసాగు భూముల హక్కు పత్రాలు త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తానన్నారు. బీ ఖాతాల అభియాన ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేపీసీసీ సభ్యుడు పాపన్న, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు ఏ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హేమావతిలో భక్తుల సందడి



బసవన్నకు అరటి పండ్లు రాస్తున్న భక్తులు

హేమావతి (అమరాపురం): హేమావతిలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తులతో సందడిగా మారింది. తినుబండారాలు, ఆట వస్తువుల దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అమెరికాలో స్థిరపడిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సీఐ రాజ్‌కుమార్ , ఎస్ఐ ఇషాక్‌బాషా ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.



రథాన్ని లాగడానికి వచ్చిన కాడెద్దులు



బ్రహ్మ రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

వివిధ సమస్యలపై 9 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ, తదితర సమస్యలపై 9 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.